క్లుప్తంగా

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతుకు స్టాల్ టోకెన్ ఇస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్లను గురువారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ పరిశీలించారు. వారు విక్రయిస్తున్న సరకుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం బజారు 86, సాయంత్రం బజారు 45 స్టాళ్లకు డ్రా తీసి వ్యాపారులకు కేటాయించారు. ఈ సందర్భంగా యాసిన్ మట్లాడుతూ రైతులు వారికి వచ్చిన స్టాల్‌లో వ్యాపారం నిర్వహిరచాలని సూచించారు. ప్రతి రైతు వద్ద ఐడీ కార్డు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 8 ట్రాక్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధుడు మరణించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సుమారు 60 ఏళ్ల వయసు గల వృద్ధుడు రైల్వే ట్రాక్‌పై మృతి చెందాడు. ఇతడు సుమారు 5.6 అడుగుల ఎత్తు, చామన చాయ శరీర రంగు. లేత పసుపు, తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ చొక్కా, నీలం, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ 94934 74582, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్‌ఐ మధుసూదనరావు కోరారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు



సూర్యకుమారి

మర్రిపాలెం: తన భార్య కనిపించడం లేదని ఓ భర్త కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. డి.సూర్యకుమారి అనే వివాహిత భర్తతో కలిసి కొత్తరెడ్డి కంచరపాలెం జాషువానగర్‌లో నివసిస్తోంది. బుధవారం రాత్రి భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. ఉదయం నిద్రలేచి చూసేసరికి భార్య కనిపించలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త ఎల్లయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

షిప్‌యార్డ్‌లో ఎన్నికల సందడి

సింథియా: హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల సందడి ప్రారంభమైంది. శుక్రవారం ఓటరు జాబితాను ఎన్నికల రిటైనింగ్ అధికారి ప్రకటించనుండగా, శనివారం ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. నవంబర్ 7న తుది జాబితా ప్రకటించనున్నారు. 8న నామినేషన్లు స్వీకరిస్తారు. 9న నామినేషన్లు ఉపసంహరణతోపాటు ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నారు. 18వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నికలను నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు విజేతలను ప్రకటిస్తారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో, 83090 03957లో సంప్రదించాలని కోరారు.

పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యం

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన



50వ వార్డు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధుడితో మాట్లాడుతున్న కె.కె.రాజు



మధురానగర్ వైద్య శిబిరంలో కేస్ షీట్ అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్



53వ వార్డు యూపీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలో గురువారం 130, 132 సచివాలయాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోగులకు అందిస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి ప్రైవేటు ఆస్పత్రులను ప్రోత్సహించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అందరికీ వైద్యం అందుబాటులోకి వచ్చేలా ఆరోగ్యశ్రీని బలోపేతం చేశారని, 3,200కు పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఒకవేళ ఏ కారణం చేతనైన ఆరోగ్యశ్రీ వర్తించకపోతే ఆ వైద్యానికయ్యే ఖర్చును బిల్లుల రూపంలో ముఖ్యమంత్రి కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రీయింబర్స్‌మెంట్ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి, ఏపీడీవో దుర్గాప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనర్లు మురళీకృష్ణారెడ్డి, జి.వి.రమణిరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సన్నీ, సచివాలయ కన్వీనర్లు భోగవిల్లి గోవింద్, కోటి, గోవిందమ్మ, బోనుల జయ, అప్పన్న, గౌరు నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, మండల కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రే సీఎం లక్ష్యం

మర్రిపాలెం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50, 53, 54 వార్డులకు సంబంధించి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను గురువారం ఆయన పరిశీలించారు. 50వ వార్డు 293 సచివాలయం పరిధి మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో, 53, 54 వార్డులు 299 సచివాలయం పరిధి శివనగర్ యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన శిబిరాలను ఆయా వార్డుల కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, బర్కత్ అలీ, చల్లా రజని ఈశ్వరరరావుతో కలిసి పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం వైఎస్ జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, మండల ఇన్‌చార్జి పైడి కృష్ణారావు మాస్టర్, వసంతల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షురాలు పి.సునీత, సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, సీనియర్ నాయకులు పైడి శ్రీను, పైడి ప్రతాప్, ప్రసూనా రెడ్డి, శ్రీనివాసరాజు, రాజం రాజు, ఏవీఎన్ రాజు, 53వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు–2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్యదర్శి సిహెచ్.వెంకటరమేష్, కోశాధికారి జి.రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

మద్దిలపాలెం: ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి అన్నారు. డోరు డెలివరీ మాసోత్సవాలను గురువారం ఆమె డిపో ఆవరణలో కౌంటర్ వద్ద పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సేవలను నగరంలో 10 కిలోమీటర్ల మేరకు అందిస్తామన్నారు. గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలలో పార్సిళ్లు బుక్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏటీఎం జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.19 లక్షలతో హరిత పార్కు అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ లోని హరిత పార్కు ఆధునికీకరణకు గురువారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు శంకుస్థాపన చేశారు. రూ.19 లక్షలతో ఈ పార్కులో జిమ్ ఎక్విప్‌మెంట్, వాకింగ్ ట్రాక్, టర్ఫ్ వాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. మౌలిక వసతులకు సంబంధించి ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తోందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ వార్డు అధ్యక్షురాలు పి.సునీత, సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, మండల ఇన్‌చార్జి పైడి కృష్ణారావు మాస్టర్, వసంతల అప్పారావు, సీనియర్ నాయకులు పైడి శ్రీను, పైడి ప్రతాప్, ప్రసూనారెడ్డి, శ్రీనివాసరాజు, రాజంరాజు, ఏవీఎన్ రాజు, పొన్నాడ అప్పారావు మాస్టర్, నారాయణస్వామి, ఎం.వి.రెడ్డి, రామ్మోహన్, సీహెచ్ శ్రీను, సబ్బవరపు శ్రీను, డి.ఎస్.రెడ్డి, పి.లక్ష్మణరావు, సరస్వతి, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

దుర్గాదేవికి పూజలు



అమ్మవారి సన్నిధిలో సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని గురువారం సింహాచలం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలకు కొదవలేదని నిరూపించేలా దుర్గాదేవి మండపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని క్రేజీ బాయ్స్‌ను కొనియాడారు. మండపంలో గ్లాస్ ఫ్లోరింగ్.. దానిలో చేపలు తిరిగాడేలా అక్వేరియం ఏర్పాటు చేయడం కొత్తగా ఉందన్నారు. శనివారం మధ్యాహ్నం మండపం వద్ద అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు అచ్యుతరావు, వై.గణేష్, సంతోష్, బి.సంతోష్, పి.శేఖర్, కె.రామ్మూర్తి, మహేష్ పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధితో చిన్నారి పోరాటం

దాతలు సహకరించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుష్మిక

మర్రిపాలెం: ప్రాణాంతక వ్యాధికి గురై తమ ఆరేళ్ల కుమార్తె కుష్మిక మృత్యువుతో పోరాడుతోందని మురళీనగర్ తెన్నేటినగర్‌కు చెందిన పేద దంపతులు గణేష్, షారా ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి వైద్యానికి సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం తెన్నేటినగర్‌లోని జీసస్ వర్డ్ ఆఫ్ లైఫ్ పాస్టర్ అండ్ లీడర్స్ ఫెలోషిప్ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని చెప్పారు. వైద్యానికి సుమారు రూ.15 లక్షలు అవసరమవుతుందని డాక్టర్లు తెలియజేశారన్నారు. బంధువుల సహాయంతో ప్రాణాలు కాపాడుకొస్తున్న తమకు దాతలు సహాయం అందించి తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. మీడియా ద్వారా దాతల సహాయం కోసం అభ్యర్థించారు. సహాయం చేసే వారు 79818 87454 నంబర్‌లో సంప్రదించాలని కుష్మిక తల్లిదండ్రులు కోరారు.

‘ఓపెన్ హౌస్’పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ స్టూడెంట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మ్యాన్‌ప్యాక్‌లు ఉపయోగించే తీరు, అత్యవసర సమయంలో పోలీసులు స్పందించే తీరు, కేసుల నమోదు, రిసెప్షన్ తీసుకున్న నిర్ణయాలు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానం, ఆయుధాలు ఎప్పుడు ఉపయోగించాలనే విషయాలను తెలియజేశారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెచ్‌సీ, పీసీల విధివిధానాలపై వివరించారు. ప్రతి ఒక్క విషయాన్ని విద్యార్థులు ఆసక్తిగా ఆలకించారు. వారితో సీఐ విజయకుమార్ కాసేపు ముచ్చటించారు. 57 మంది కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటరావు, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తిరంజని



భక్తిరంజని భజనలు చేస్తున్న సాయిరాజ్

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం ధర్మ ప్రచార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిరాజు భక్తి రంజని ప్రతినిధుల భజనలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు స్థల పరిశీలన

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి నుంచి అక్కయ్యపాలెం వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దొండపర్తి కుప్పిలివారివీధి, అల్లూరివారి వీధి, మండావారి వీధుల్లో స్థానికులతో జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారి అనిల్, జోన్–3 ఏసీపీలు రఘునాథ్, రామకృష్ణ, టీపీవో విజయకుమార్ సచివాలయ సిబ్బందితో కలిసి చర్చలు జరిపారు. వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు ద్వారా సంబంధిత గృహ యజమానులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ డిజైన్ మార్చి ఐదు నుంచి 13 అడుగుల వరకు విస్తరణ పనులు చేపడితే తమకు ఇబ్బందులు తప్పవన్నారు. అంతా వంద గజాలలోపు ఉన్నవారే అని తెలిపారు. ఇక్కడ కొన్ని ఆస్తులకు వారసులు మాత్రం పది మంది వరకు ఉండటంతో నేటికీ ఆస్తుల పంపకాలు జరగలేదని స్థానికులు అధికారులకు వివరించారు. వంద అడుగుల జీవీఎంసీ స్థలం ఉండగా ప్రైవేట్ స్థల యాజమానులను ఇబ్బంది పెట్టడం సరి కాదన్నారు. దీంతో అధికారులు దేవస్థానం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు స్థానికులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టిలో ఈ విషయం పెట్టి యాజమానులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

ఆకర్ష జోన్‌లో ప్రైవేట్ వాహనాల పార్కింగ్



నక్కవానిపాలెం ఆకర్ష జోన్ రోడ్డులో పార్క్ చేసిన కార్లు, మినీ వ్యాన్లు, టూ వీలర్లు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నక్కవానిపాలెంలోని ఖాళీ స్థలంలో ఆకర్ష జోన్ పనులు పూర్తి కావడంతో ప్రైవేట్ వాహనాలను ఇష్టానుసారంగా పార్క్‌చేస్తున్నారు. ఈ రోడ్డులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ షాపులు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేయడంతో స్థానికులు, ఇతర వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. సీతమ్మధార రైతుబజార్ వద్ద రోడ్డుపై వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారిన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండాలని అధికారులు ఆకర్ష జోన్ ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ప్రైవేట్ యాజమాన్యాలు తమ మినీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొండవాలులో వీధిలైట్లు వెలిగించండి



రాంజీ ఎస్టేట్‌లో వెలగని వీధిలైటు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, కప్పరాడ, పెద కొత్తూరు, అరుంధతి నగర్, జవహర్‌లాల్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాంజీ ఎస్టేట్‌లో 91ఏ/1/5 విద్యుత్ స్తంభం లైట్లు సక్రమంగా పనిచేయడం లేదు. రాత్రి సమయంలో వీధుల్లో కుక్కల బెడదతోపాటు దొంగతనాల జోరు ఎక్కువగా ఉంది. వీధిల్లో రాకపోకలు సాగించాలంటే మహిళలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– కె.విజయలక్ష్మి, రాంజీ ఎస్టేట్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ కంచె



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కంచె దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీ ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచె ప్రమాదకరంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి విక్రయించే వ్యాపారులు ఇక్కడ తిష్ట వేసి వ్యాపారాలు చేస్తున్నారు. లోడ్‌తో వచ్చే వాహనాలు ట్రాన్స్‌ఫార్మర్ కంచె పైకి వెళ్లడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. కప్పరాడ పాఠశాలల విద్యార్థులు, భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీకి వచ్చే రోగులు భయాందోళనలు చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణగా కంచె ఏర్పాటు చేయాలి.

– సిహెచ్.శివకుమార్, ఐటీఐ జంక్షన్

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



అప్పన్న నిత్య కల్యాణాన్ని తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరి శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పూజలలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంయింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం జరిపించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు



షిర్డీసాయిబాబా

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం బాబాకు హారతి సమర్పించిన అనంతరం భక్తులకు, పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



కనకమహాలక్ష్మి సేవలో భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రూ.1,000 చెల్లించినా దంపతులను లేదా ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

పరిశ్రమలను కాపాడుకుంటేనే భవిష్యత్తు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్రప్రభుత్వ పెద్దలు దేశంలోని ప్రజాసమస్యలను వదిలిపెట్టి తమ రాజకీయ అవసరాల కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీల కుట్ర రాజకీయాలను వ్యతిరేకించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వారికి వంతపాడుతున్నాయన్నారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు.